క్లుప్తంగా

13న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన

టేకులపల్లి: ఈనెల 13న తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క టేకులపల్లి మండలంలో అధికారికంగా పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా నాయకుడు కోరం సురేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు బేతంపూడి దర్గా నుంచి బద్దు తండా వరకు రూ.1.65 కోట్లతో రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి, 3 గంటలకు ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భట్టి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఆ తరువాత 4 గంటలకు కోయగూడెం ఓపెన్‌కాస్టుని తనిఖీ చేస్తారని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

జూలూరుపాడు: గుండ్లరేవు గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి ప్రారంభించారు. మాట్లాడుతూ... క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగించడంతోపాటు, ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో మాలోత్ మంగీలాల్ నాయక్, లకావత్ లచ్చు నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, బానోత్ నవీన్ రాథోడ్, బానోత్ జగన్, బోడా కృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు ఉండొద్దు



మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: మండలంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంజూరు చేసిన సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్ నిర్మాణం, డ్రెయినేజీలు, వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం లేకుండా పనులు పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. దంతలబోరు ఎస్సీకాలనీ, సంగం, సోములగూడెం, బస్వతారకకాలనీ, రేగులగూడెం, ఉల్వనూరు, పాండురంగాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ఆదివారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీ పెద్దమ్మతల్లి జాతర



పెద్దమ్మతల్లిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తున్న ఆదివాసీ గిరిజనులు

జూలూరుపాడు: రామచంద్రాపురం గ్రామంలో శ్రీపెద్దమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. ఆదివాసీ గిరిజనుల కులదైవమైన శ్రీపెద్దమ్మ తల్లి జాతర చివరిరోజు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రతీ మూడేళ్లకోసారి ఈ జాతరను ఆదివాసీ గిరిజనులు జరుపుకుంటారు. ఆదివాసీ మహిళలు, ఆడపడుచులు శ్రీపెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించడంతో జాతర ముగిసింది.

హైవేపై హడల్..!

- జాతీయ రహదారిపై మట్టి కుప్పలు
- కాంక్రీట్ వాల్ లేక ప్రమాదకరంగా కల్వర్టు
- భయంకరంగా గోవర్ధనగిరి కాలనీ రోడ్డు
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు





కల్వర్టుకు కాంక్రీట్ వాల్ లేని దృశ్యం (ఇన్‌సెట్) జాతీయ రహదారిపై మట్టి కుప్పలు

పాల్వంచ: కొత్తగూడెం నుంచి భద్రాచలం వెళ్లే రహదారిలో పాల్వంచ ఒడ్డుగూడెం క్రాస్ రోడ్డు సెంటర్ చుట్టుపక్కల ప్రమాదం పొంచి ఉంది. అక్కడ రోడ్డుపైనే రోజుల తరబడి భారీ ఎత్తున మట్టి, రాళ్లు, కంకర దిమ్మెలు కుప్పలుగా పోసి ఉన్నాయి. చింతలచెర్వు అలుగు నీరు, డ్రెయినేజీ నీళ్లు వెళ్లే పెద్ద కల్వర్టు ఉండగా.. దానికి ఇరువైపులా ఎలాంటి కాంక్రీట్ వాల్స్ లేక పోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చిపడుతుందో అర్థం కాని పరిస్థితి. ఒడ్డుగూడెం వెళ్లే సీసీ రోడ్డును హైవే రోడ్డుకు సరిగా కలపక పోవడంతో ఇక్కడ వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక గోవర్ధనగిరి కాలనీకి వెళ్లే సీసీ రోడ్డుకు ఇరువైపులా కాల్వలు ఉండటంతో అటుగా వెళ్లేవారు భయాందోళనకు గురవుతున్నారు. వీటిపై మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డుమీదనే మట్టి కుప్పలు..

ప్రమాదకరంగా కల్వర్టు

ఇక ఒడ్డుగూడెం క్రాస్ రోడ్డు వద్ద భారీ వాహనాల సర్వీసింగ్ సెంటర్ ఉంది. దీంతో అక్కడ నిత్యం వాహనాలు నిలుపుతున్నారు. అటుగా తిరిగే బాటసారులు, వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ సర్వీసింగ్ సెంటర్ ముందే భారీ ఎత్తున నాలుగైదు అడుగుల ఎత్తులో మట్టి, రాళ్ల కుప్పలు పోసి ఉంచారు. వీటిని తొలగించే నాథుడు లేకుండా పోయారు. ఇక కల్వర్టుకు ఇరువైపులా కాంక్రీట్ వాల్ కట్టకుండా వదిలేశారు. వాల్ లేక ఐరన్ రాడ్లు తేలి ప్రమాదాలకు నెలవుగా ఉంది. వాహనదారులు ఏమాత్రం ఎమరుపాటున ఉన్నా కల్వర్టులో పడే ప్రమాదం ఉంది. గోవర్ధనగిరి కాలనీ రోడ్డు సైతం ఇరువైపులా భారీ కాల్వల నడుమ ఉండటంతో అటుగా వెళ్లే కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎటు చూసినా ఐదారు అడుగుల లోతుతో కాల్వలు ఉండటంతో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒడ్డుగూడెం క్రాస్ రోడ్డు అధ్వానం..

ఒడ్డుగూడెంకు వెళ్లే క్రాస్ రోడ్డు (లారీ ఓనర్స్ ఫంక్షన్ హాల్ సెంటర్) ఇప్పుడు కూడలి. కొత్తగూడెం వైపు నుంచి పాల్వంచ, కిన్నెరసాని ప్రాజెక్టుకు వెళ్లే వారు, పలు గ్రామాలతో పాటు, టీచర్స్ కాలనీ, కొమ్ముగూడెం, సీతారాంపట్నం, గట్టాయిగూడెం, ఒడ్డుగూడెం, బొల్లేరుగూడెం, కరకవాగు తదితర ఏరియాలకు చెందిన వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే క్రాస్ రోడ్డు సరైన విస్తీర్ణం లేక పోగా, అక్కడ కోయిలా వాటర్ ప్లాంట్ వద్ద సీసీ రోడ్డు, హైవే ఎక్కే చోట లింక్ కలపక పోవడంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై ఉన్న గుంతలు కనిపించక ఎత్తుగా ఉండే హైవే ఎక్కే క్రమంలో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఓ లారీ ఆ రోడ్డులో దూసుక రావడంతో రోడ్డు పక్కనే ఉన్న సెంట్రల్ లైటింగ్ కుప్ప కూలి ధ్వంసం అయింది. ఆ లారీ కింద ఓ స్కూటీ నుజ్జునుజ్జయింది. స్కూటీ నడిపే వ్యక్తి తృటిలో ప్రాణాలు రక్షించుకున్నాడు. ఇక దమ్మపేట సెంటర్ సైతం విస్తీర్ణం లేక భారీ వాహనాలు టర్న్ అయ్యేప్పుడు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. మూడు రోజుల క్రితం ఇక్కడ కూడా ఓ బైక్ లారీ వెనక చక్రాల కింద పడి పప్పయిపోయింది. బైక్ నడిపే వ్యక్తి చాకచాక్యంగా ప్రాణాలతో బయటపడ్డాడు.

మట్టికుప్పలు తొలగించాలి...



ఒడ్డుగూడెం క్రాస్ రోడ్డు వద్ద పెద్దపెద్ద మట్టి కుప్పలు ఉన్నాయి. వీటిని తక్షణం తొలగించాలి. అలుగు పారే పెద్ద కల్వర్టు ఇరువైపులా కాంక్రీట్ వాల్స్ లేవు. దీనివల్ల జాతీయ రహదారిపై నిత్యం తిరిగే వాహనాలదారులకు ప్రాణ సంకటంగా ఉంది. తక్షణం కాంక్రీట్ వాల్స్ నిర్మాణం చేయాలి.

– ఎ.రవీందర్‌రెడ్డి, ఒడ్డుగూడెం

ఎవరూ పట్టించుకోవడం లేదు...



గోవర్ధనగిరి కాలనీ సీసీ రోడ్డుకు ఇరువైపులా పెద్ద కాలువలు ఉండటంతో ప్రమాదకరంగా ఉంది. ఒడ్డుగూడెం క్రాస్ రోడ్డును హైవేకు కలపకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ డేంజర్ స్పాట్లు అనేకం ఉన్నాయి. అధికారులు తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– శంకర్, గోవర్ధనగిరి కాలనీ

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా..



ఒడ్డుగూడెం సెంటర్ వద్ద రహదారిపై ఏర్పడిన సమస్యలను స్వయంగా పరిశీలిస్తా. అనంతరం అధికారులతో చర్చించి తగు పరిష్కారానికి కృషి చేస్తాం. ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటాం. మా పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్

ఘనంగా మాతృదినోత్సవం



సైనికుల తల్లులను సన్మానిస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం వనందాస్‌గడ్డలో ఆదివారం మాజీ కౌన్సిలర్లు మునిగడప వెంకటేశ్వర్లు, మునిగడప పద్మ ఆధ్వర్యంలో మాతృదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్‌లో వీరవనితలు మహిళా కమాండర్ సోఫియా ఖురేషి, విగ్ కమాండర్ వ్యోమికసింగ్‌లు భరతమాత సింధూరం మహాశక్తిన్ని చూపారని కీర్తించారు. ఆర్మీలో పనిచేస్తున్న తెలగరి అభిలాష్, భానోత్ గౌతమ్ తల్లులు తేలగరి మాణిక్యం, బానోత్ సుశీలతో పాటు వృద్ధాప్యంలో ఉన్న తల్లులను సత్కరించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సూరి, మేని జనార్థన్, ఎస్‌కే జలీల్, బానోత్ చందర్, కట్ట సత్యనారాయణ, అస్మద్‌పాషా, షణ్ముకచారి, రమేష్, మునిగడప స్వరాజ్యం, ముద్దం మార్తమ్మ, బానోత్ కమల, సత్యవతి, తెలగరి సౌజన్య, పద్మ, శ్రీదేవి, కవిత పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



పాల్వంచ: మాట్లాడుతున్న అబ్దుల్ జలీల్



టేకులపల్లి: కేఓసీ పీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న టీయూసీఐ నాయకులు

పాల్వంచ: దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం విఫలం అయిందని, ఈనెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘాల కన్వీనర్ షేక్ అబ్దుల్ జలీల్, సీఐటీయూ నాయకులు దొడ్డా రవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కేటీపీఎస్ ఐఎన్‌టీయూసీ(327) కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. మోదీ వచ్చిన దగ్గర నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారని, 44 లేబర్ కోడ్‌లను నాలుగు కోడ్‌లుగా అమలు చేసి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. కేంద్ర పరిశ్రమలను ప్రైవేట్ పరం చేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు.

సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జెన్‌కో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ మజీద్, కేశబోయిన కోటేశ్వరరావు, రాజేందర్, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, సత్య, పిచ్చిరెడ్డి, గోనె రామారావు, ఖాజామియా, బాలు నాయక్, శనగ రామచందర్ రావు, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

కేఓసీ పీఓకు సమ్మె నోటీస్...

టేకులపల్లి: ఈనెల 20న దేశ వ్యాప్తంగా తలపెట్టిన సమ్మెకు సహకరించాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్‌షావలీ, మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న కోరారు. ఈ మేరకు ఆదివారం యూనియన్ ఆధ్వర్యంలో కోయగూడెం ఓపెన్ కాస్టు ప్రాజెక్టు ఆఫీసర్ గోవిందరావు, టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారావు సమ్మె నోటీసు అందజేశారు. కేఓసీ బొగ్గు టిప్పర్ల ద్వారా ఇల్లెందు, కొత్తగూడెం, నవభారత్, బీపీఎల్ తదితర ప్రాంతాలకు బొగ్గు రవాణా చేస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యాక్సిడెంట్లకు డ్రైవర్లని దోషులుగా చేస్తోందని విమర్శించారు. మోటార్ హిట్ అండ్ డ్రైవ్ చట్టాన్ని తెచ్చి డ్రైవర్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. టేకులపల్లి ఏరియా కార్యదర్శి జరుపుల సుందర్, బ్రాంచి కార్యదర్శి గుగులోత్ మదార్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలి



మాట్లాడుతున్న మధు

ఇల్లెందు: ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని,, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్ చేసింది. ఆదివారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లోని 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను అదానీ, అంబానీ కంపెనీలకు కట్టబెట్టేందుకు బలవంతంగా ఆదివాసీలను ఖాళీ చేయించేందుకు ఆపరేషన్ ఖగార్ పేరుతో ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో హతమారుస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. ఈ నెల 13న ఇల్లెందులో అఖిలపక్షాలు, ఆదివాసీ సంఘాలు నిర్వహించే ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నబీ, దేవరకొండ శంకర్, కోరీ, ముద్రగడ వంశీ, రమణాల లక్ష్మయ్య, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: అమ్మవారిని దర్శనం చేసుకునే భక్తులకు దాతల సహకారంతో ఈఓ రజనీకుమారి ఆదివారం మజ్జిగను పంపిణీ చేశారు. శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద సామినేని రమేష్, లక్ష్మీకుమారి, అత్తులూరి ధనలక్ష్మి, మరకల నర్సింహారెడ్డి, రాధ, తిరుమలచారి, లక్ష్మి, వేణు, రేఖ మజ్జిగను భక్తులకు వితరణగా అందజేశారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా యూటర్న్‌లు

సుజాతనగర్‌లోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డివైడర్ల మధ్య నాటిన మొక్కలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఎత్తుగా, ఏపుగా పెరిగిన చెట్ల వలన యూటర్న్ తీసుకునే సమయంలో అటువైపు నుంచి వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. యూటర్న్ ఉందని, వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా వెళ్లాలని సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని వాహనదారులు వాపోతున్నారు. – సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి: చెన్నకేశవరావు, పంచాయతీ సెక్రటరీ
సెల్ నంబర్: 9703775478

విగ్రహ ప్రతిష్ఠ



కొలువుదీరిన గంగమ్మతల్లి

ఇల్లెందురూరల్: లచ్చగూడెం గ్రామపంచాయతీలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో బొగ్గారపు సంగయ్య, ఆవుల చంద్రయ్య, రమణయ్య, బొగ్గారపు వెంకన్న, కమటం మాధవరావు, గుంటి కృష్ణ, ఆవుల సత్యనారాయణ, నామాల సంతోష్, గుంటి శ్రీను, వెంకన్న, నల్లోతుల వెంకటేశ్వర్లు, సాయిలు, హనుమంతరావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

బస్ సర్వీసును పునరుద్ధరించండి..

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టుకి బస్సుని పునరుద్ధరించాలని ఏఐటీయూసీ పిట్ సహాయ కార్యదర్శి షేక్ సర్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కేఓసీ పీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం మేనేజర్ పేరాల శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోయగూడెం ఓసీలో కార్మికుల సౌకర్యార్థం విధులకు హాజరయ్యేందుకు మూడు షిఫ్టుల్లో బస్సు సౌకర్యం ఉండేదని, ఆ బస్సు టెండర్ గురువారంతో ముగిసిందన్నారు. దీంతో వేరే బస్సును కంపెనీ ఏర్పాటు చేయాల్సి ఉండగా జాప్యం చేస్తోందని, కార్మికులు మూడు రోజుల నుంచి వారి సొంత వాహనాలపై విధులకు హాజరవుతున్నారని తెలిపారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామల శ్రీనివాస్, కనకరాజు, ధశ్‌సింగ్, ఉమామహేశ్వరరావు, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నిప్పు.. నేల సారానికి ముప్పు

ప్రస్తుతం వరి కోతలన్నీ దాదాపుగా యంత్రాలతోనే జరుగుతున్నాయి. ఈ విధానం వల్ల వెంటవెంటనే ధాన్యం రాసులు ఇంటికి చేరటం, అమ్మకాలు పూర్తవడం.. అన్నదాతకు సౌకర్యవంతంగా ఉంటోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. పొలంలో మిగిలిపోతున్న గడ్డికి, పంట కుదుళ్లకు రైతులు నిప్పు పెట్టి దుష్ఫలితాలను పొందుతున్నారు. ఈ విధానం భవిష్యత్ సేద్యంపై ప్రభావం చూపడంతోపాటు అగ్ని ప్రమాదాలకు ఆస్కారం కల్పిస్తోంది.

- మిత్ర జీవుల మనుగడకు ప్రమాదం
- తరవాత పంటల్లో దిగుబడులపై ప్రభావం



పంట చేలో వ్యాపిస్తున్న మంటలు



చేనులో వ్యర్థాలను తగులబెడుతున్న రైతు

ఇల్లెందురూరల్: వ్యవసాయంలో యాంత్రీకరణ కారణంగా ప్రస్తుతం వరినాట్లు, వరికోతల విధానంలోనూ పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. కూలీల కొరతను అధిగమించేలా నాట్లు, కోతలకు ఉపయోగపడేలా యంత్రాలను రూపొందించడంతో వాటి వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా యంత్రాల వినియోగమే. వరికోత యంత్రాలు లేని సమయంలో కూలీలతోనే వరి కోతలు జరిగేవి. ఆ సమయంలో కూలీలు నేల వరకు వరి కుదుళ్లు కోసేవారు. దీనివల్ల తరువాత పొలం దున్నినా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేది. కానీ ప్రస్తుతం యంత్రాలతో వరికోతలు చేపట్టడం వల్ల వరిపనలో సగం వరకు మాత్రమే కోత పూర్తవుతోంది. మిగితాదంతా పొలంలోనే ఉంటోంది. ఈ సగం వరకు ఉన్న కుదుళ్లకు రైతులు నిప్పు పెట్టి కాల్చేస్తున్నారు. ఈ అలవాటును ఇతర పంటల్లోనూ రైతులు కొనసాగిస్తున్నారు. వరి పొలంలో మాదిరిగా మొక్కజొన్న, పత్తి చేలల్లో పంటకాలం అనంతరం మిగిలిపోయిన వ్యర్థాలను కూడా కాల్చివేస్తున్నారు. ఇలా చేయడం భవిష్యత్ సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా భూమిలో ఉన్న పోషకాలను రైతులే స్వయంగా నాశనం చేసుకుంటున్నారు. దిగుబడి కోసం తరువాత పురుగుమందులు, ఎరువులపై ఆధారపడుతున్నారు. ఇంతేకాకుండా వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. దానితోపాటు వేడి గాలులు కూడా వీస్తుంటాయి. ఎక్కడో ఒకచోట పొలంలో కోసిన వరికి నిప్పు పెడితే అది దావానంలా వ్యాపిస్తోంది. ఇలాంటి సమయంలో ప్రమాదాలు కూడా సంభివిస్తున్న దాఖలాలు ఉన్నాయి.

దుష్ఫలితాలు అనేకం..

రైతులు పొలంలో ఉన్న వరి కుదుళ్లకు నిప్పు పెడుతుంటారు. ఈ కుదుళ్లు ఉంటే తిరిగి పంట వేసుకునే సమయంలో దున్నేందుకు, దుక్కికి అడ్డంకిగా ఉంటుందని పూర్తిగా కాల్చేస్తున్నారు. ఇలా చేస్తే రైతుకే నష్టం జరుగుతోంది. నిప్పు పెడితే భూమి తన సారాన్ని కోల్పోతుంది. అలాగే ఉంచి దున్నేస్తే మంచి సారం వస్తుందని వ్యవసాయ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. భూమిలో మెగ్నీషియం, కాల్షియం, సూక్ష్మజీవులు వృద్ధితోపాటు నత్రజని పెరుగుతుందని.. తద్వారా చౌడును తగ్గించి తరువాత పంటకు ఉపయోగపడుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. తిరిగి పంట వేసుకునే టప్పుడు వేర్లు భూమిలోకి వెళ్లడానికి కూడా అవకాశం ఉంటుందని.. ఫలితంగా మొక్క బాగా ఎదిగేందుకు దోహదపడుతుంని పేర్కొంటున్నారు. అదే నిప్పు పెట్టి కాల్చివేస్తే నేల సారవంతం కావడానికి, మొక్క ఎదుగుదలకు ఉపయోగపడే మేలు రకాలన్నీ నాశనం అవుతాయి. అలాగే పంటకు మేలు చేసే ఎర్రలు కూడా పూర్తిగా చనిపోయే ప్రమాదం ఉంటుంది. దీనివల్ల భవిష్యత్‌లో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం పొలంలో వరిగడ్డి ఎక్కువగా ఉందని నిప్పు పెట్టుకోవడం వల్ల భూమిలో ఉన్న ప్రతీది నశించిపోతోంది. భూమిని దున్నే సమయంలో రైతులకు కొద్ది కష్టంగా ఉంటుంది. కానీ దీనివల్ల భూమిలో సారం పెరగడంతోపాటు దిగుబడులు పెరిగి అంతిమంగా మేలు చేకూరుస్తుంది.

నిప్పు పెట్టడం వల్ల రైతుకు నష్టం..



పంట చేలల్లో వ్యర్థాలకు నిప్పు పెట్టడం సరైన విధానం కాదు. దీనివల్ల మిత్రజీవులు పూర్తిగా నశించిపోతాయి. తర్వాతి సీజన్‌లో సాగు చేసే పంటల్లో దిగుబడి తగ్గే ప్రమాదం ఉంటుంది. వరికోతల్లో మిగిలిన గడ్డిని అలాగే ఉంచి తడిపిన తరువాత దున్నితే నేలకు పోషకాలుగా ఉపయోగపడుతాయి.

– సతీష్, వ్యవసాయశాఖ అధికారి, ఇల్లెందు

దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన సైనికుడికి నివాళి

టేకులపల్లి: దేశ రక్షణలో బంజారా బిడ్డ మురళీనాయక్ అమరుడయ్యాడని వక్తలు కొనియాడారు. ఈ మేరకు ఆదివారం రాత్రి సేవాలాల్ సేన ఆధ్వర్యంలో టేకులపల్లిలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. టేకులపల్లి సెంటర్‌లో మానవహారం నిర్మించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. పాకిస్తాన్ సైన్యంతో వీరోచితంగా పోరాడుతూ అసువులు బాసిన అమరుడైన మురళీనాయక్ పవిత్రమైన ఆత్మకు శాంతి కలగాలన్నారు. కుటుంబానికి రూ.2 కోట్లు, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ నాయక్, భూక్యా ధశ్‌సింగ్‌నాయక్, ఇస్లావత్ లక్ష్మణ్, హతీరామ్, హనీఫ్, పూన్యా, బానోత్ సక్రు, భూక్యా దేవా, రాంచందర్, రవి రాథోడ్, బానోతు కిషన్ నాయక్, శ్రీను, వెంకటేష్, జరపల లాలూ, కిషోర్‌సింగ్, బోడ బాలు, మంగీలాల్, వీరు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: భారత–పాక్ యుద్ధంలో మృతి చెందిన జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తూ ఆదివారం రాత్రి జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం గ్రామ ప్రజలు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. జవాన్ మురళీనాయక్, కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రజలు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌కు, ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు, పిల్లలు, మహిళలు పాల్గొన్నారు.



టేకులపల్లిలో మానవహారం నిర్మించి కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న దృశ్యం



జూలూరుపాడు: పడమటనర్సాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -9000327175 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి — పాఠక మహాశయులకు విజ్ఞప్తి — Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148
కె. మధు - 97059 44416